నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 23 సెప్టెంబర్ 2024 | SIDDIPET

## తిరుపతి లడ్డూపై రాజకీయం చేయడం తగదు



**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**

దుబ్బాక, సెప్టెంబర్ 22 : ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి పాత్రుడైన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో లడ్డూ విషయమై రాజకీయం చేయడం బాధాకరమని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆదివారం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. టీటీడీ లడ్డూ అపవిత్రత చోటు చేసుకుందని కొద్ది రోజులుగా ఏపీ సీఎం చంద్రబాబు , మాజీ సీఎం జగన్‌తో సహా ఆయా పార్టీల నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ టీటీడీ, లడ్డూ పవిత్రతను దెబ్బతీస్తున్నారన్నారు. లడ్డూ పవిత్రత వ్యవహారంలో ఏమైనా పొరపాటు జరిగితే ప్రభుత్వం విచారణ చేయాలని, ఎవరైనా తప్పు చేసినట్లు తేలితే వారిపై సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలన్నారు. కానీ, ఇవేవీ లేకుండా లడ్డూ వ్యవహారాన్ని బహిరంగం చేసి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడం సరైంది కాదన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి లడ్డూ పవిత్రను కాపాడాలని, భక్తుల విశ్వాసాలకు పెద్దపీట వేయాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు.

## వినాయక నిమజ్జనం


దుబ్బాక, సెప్టెంబర్ 22 : సిద్దిపేట జిల్లా దుబ్బాక పట్టణంలో శనివారం రాత్రి నుంచి వినాయక నిమజ్జన శోభాయాత్ర వైభవంగా కొనసాగింది. ఆదివారం సాయంత్రం స్థానిక పెద్ద చెరువులో గణనాథులను భక్తులు నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



దుబ్బాక: పెద్దచెరువులో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు

## రుణమాఫీ కాక రైతులు గోస పడుతుండ్రు

- రుణమాఫీపై సీఎం, మంత్రులు గొప్పలు జెప్పుకొండ్రు
- సగం మంది రైతులకు రుణమాఫీ వర్తించలేదు..
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి
- సిద్దిపేట జిల్లా ధర్మారంలో సెల్ఫీ ఫర్ రుణమాఫీ వీడియో ఉద్యమానికి శ్రీకారం
- రుణమాఫీ కాలేదని సీఎంవోకు వీడియోలు పంపిన 400 మంది రైతులు



ధర్మారంలో సెల్ఫీ ఫర్ రుణమాఫీ వీడియో సమావేశంలో మాట్లాడుతున్న తోట కమలాకర్‌రెడ్డి

మిరుదొడ్డి, సెప్టెంబర్ 22 : దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు ఎలాంటి షరతులు లేకుండా సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో ఆదివారం 'సెల్ఫీ ఫర్ రుణమాఫీ వీడియోలు' ట్విటర్, ఫేస్ బుక్కు ద్వారా పంపే వినూత్న కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి బీఆర్‌ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా తోట కమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. రుణమాఫీ చేశామని జబ్బలు చరుచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, నీకు రైతులు గట్టి జవాబు చెబుతూ సెల్ఫీ వీడియోలు తీసి పంపిస్తున్నారు. ఒక్క ధర్మారం గ్రామంలోనే రుణమాఫీ కాని 400 మంది రైతులు మానసికంగా ఇబ్బందులు పడుతూ సీఎం రేవంత్ రెడ్డి సెల్ఫీ వీడియోలు తీసి పంపారన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ చేశామని మీడియాలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు గొప్పలు చెప్పుకోవడం తప్పితే సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఈనెల 18న రుణమాఫీ కాని రైతులు మిరుదొడ్డి తహసీల్ కార్యాలయం వద్దకు 1000 మంది వరకు వచ్చి ధర్నా చేస్తే, బీఆర్‌ఎస్ నాయకులు వారికి డబ్బులు ఇచ్చి తీసుకువచ్చి ఆందోళన చేయించారని కాంగ్రెస్ నాయకులు దుర్మార్గమైన ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి గద్దె నెక్కి, ఇప్పుడు అందరినీ మోసం చేస్తున్నాడని విమర్శించారు. మీ మాటలకు మోసపోయిన రైతులు తమ బాధలను సెల్ఫీ వీడియోలు తీసి సీఎంవోకు ట్యాగ్ చేసి పంపిస్తున్నారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి రైతులు వీడియోల ద్వారా డిజిటల్ ర్యాగింగ్ చేస్తారని హెచ్చరించారు. మిరుదొడ్డి మండల వ్యాప్తంగా 1500 మంది రైతుల నుంచి డిజిటల్ వీడియోలు సీఎంవోకు వెళ్లడం ఖాయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ సెల్ఫీ వీడియో ఉద్యమం లేపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పోలీసు రాజులు, మాజీ సర్పంచ్‌లు తుమ్మల బాల్‌రాజు, జోగ్గారి బాల్‌నర్సయ్య, నాయకులు సూకురి లింగం, తీపి రెడ్డి దుర్గారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మైసయ్య, పర్శరాములు, నారాయణ, మల్లేశం గౌడ్, భిక్షపతి, బాల్‌రాజు పాల్గొన్నారు.

### కాంగ్రెసోళ్లు మోసం చేసిండ్రు..



సీఎం రేవంత్‌రెడ్డి సార్ నిన్ను రూ.2 లక్షల రుణమాఫీ చేయమని రైతులము అడిగినామా.అప్పుడు రూ.2 లక్షల వరకు రుణమాఫీ ఇత్తమని మీరే చెప్తిరి. ఇప్పుడేమో చెయ్యక పోతిరి. పక్కోనికి అచ్చే మాకు రుణమాఫీ రాక పోయే. రేవంత్‌రెడ్డి అన్ని మాయమాటలు చెప్పుతుండు. నాకు రూ.2 లక్షల కంటే ఎక్కువ లోన్ ఉంటే నేను బ్యాంకులో పైన డబ్బులు కట్టిన. కానీ, నాను ఇప్పటికి లోన్ మాఫీ కాలేదు. అందుకే సీఎంకు నా సెల్ఫీ వీడియోను తీసి పంపుతున్న.

**-కరికే మైసయ్య, రైతు, ధర్మారం, మిరుదొడ్డి మండలం, సిద్దిపేట జిల్లా**

### నాకు రూ. 2 లక్షల రుణమాఫీ కాలేదు



నాకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని చేయలేదు. సీఎం రేవంత్ రెడ్డి చెప్పేది ఒక్కటి చేసేది ఒక్కటిలా ఉంది. కేసీఆర్ ఉన్నప్పుడే మంచిగుండే. మా రైతులకు అప్పుడు అన్ని అచ్చినయి. ఇప్పుడు రైతులకు ఏది వస్తలేదు. రూ.2 లక్షల రుణమాఫీ చేయకుంటే ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతది.

**- కొమురయ్య, రైతు, ధర్మారం, మిరుదొడ్డి మండలం,సిద్దిపేట జిల్లా**

## మేళ్ల చెరువు కబ్జాలపై కలెక్టర్ ఆరా

రామచంద్రాపురం,సెప్టెంబర్ 22: మేళ్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జరిగిన కబ్జాలపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాం తి ఆరాతీశారు. తెల్లాపూర్‌లోని మేళ్ల చెరు వు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జరిగిన ఆక్రమణలపై నమస్తే తెలంగాణ 'మేళ్ల చెరువుని మింగేస్తుం డ్రు' అనే శీర్షికను ప్రచురించింది. దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో జరిగిన ఆక్రమణలపై నివేదికలను సిద్ధం చేయాలని ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారుల ను ఆదేశించారు.ఆక్రమణలపై కలెక్టర్‌తో, హైడ్రాకు లేఖ రాయనున్నట్లు తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఆక్రమణలు జరిగిన మా ట వాస్తవమేనని, ఇప్పటికే కలెక్టర్ ఆయా నిర్మాణాల విషయమై ఆరా తీశారని, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు ఆక్రమణలపై నివేదికలను సమర్పించాలని కలెక్టర్ సూచించినట్లు తెలిపారు. చెరువు ఆక్రమణలపై నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని చెరువులను అధికారులు పరిరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆలు రైతుకు విత్తన కష్టం

- స్థానికంగా అందుబాటులో లేని విత్తనాలు
- ఆగ్రా, జలంధర్‌కు వెళ్లి విత్తనాలు తెచ్చుకోవాల్సిందే..
- కోల్డ్ స్టోరేజీ నిర్మిస్తేనే రైతులకు మేలు
- సంగారెడ్డి జిల్లాకోహీర్ మండలంలో 2వేల ఎకరాలపైనే సాగు



జలంధర్ నుంచి వచ్చిన ఆలుగడ్డ విత్తనాలను దించుతున్న కూలీలు

కోహీర్, సెప్టెంబర్ 22: స్థానికంగా కోల్డ్ స్టోరేజీలు లేక ఆలుగడ్డ రైతులు విత్తనాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విత్తనాల కోసం ఆగ్రా, పంజాబ్‌లోని జలంధర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. రైతులకు విత్తనాలను అందుబాటులో ఉంచాల్సిన ప్రభుత్వం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. వ్యాపారుల నుంచి 50 కిలోల బస్తాను రూ.1600కు కొనుగోలు చేసి రైతులు ఆలు సాగుచేస్తున్నారు. వానకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఆలుగడ్డ పంట సాగుపై అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు. బోరుబావుల్లో పుష్కలంగా నీళ్లు ఉండడంతో ఆలుగడ్డ సాగుపై రైతన్నలు ప్రత్యేక దృష్టిసారించారు. సంగారెడ్డి జిల్లాలో అత్యధికంగా కోహీర్ మండలంలో 2 వేల ఎకరాలకు పైగా సాగవుతున్నది. గతేడాది 938 మంది రైతులు 2,300 ఎకరాల్లో ఆలుగడ్డ పంట సాగుచేశారు. ప్రస్తుతం వానలు సమృద్ధిగా కురవడంతో సాగు విస్తీర్ణం 3వేల ఎకరాలకు పెరిగే అవకాశం ఉంది. ఆలుగడ్డ విత్తనం నాటిన తర్వాత 80 రోజుల నుంచి 100 రోజుల్లో పంట చేతికి వస్తుంది. తొందరగా లాభాలను పొందాలనే ఉద్దేశంతో రైతులు ఆలు సాగుపై మక్కువ ప్రదర్శిస్తున్నారు. మరీ ఇంత తక్కువ కాల పరిమితిలో ఇతర పంటలు ఏవీ కూడా చేతికి రావు. దీంతో బోరుబావుల్లో పుష్కలంగా నీరు ఉన్న రైతులు ఆలు సాగుపై శ్రద్ధ కనబరుస్తున్నారు. ఖాళీ భూమి ఉన్న రైతులతో పాటు సోయాబీన్ పంట ధాన్యం తీసుకొని అందులో కూడా ఆలుగడ్డ విత్తనం నాటుతున్నారు.

**ఆగ్రా నుంచి ఆలుగడ్డ విత్తనాలు...**

సంగారెడ్డి జిల్లాలో అధికంగా కోహీర్ మండలంలో ఆలుగడ్డ సాగవుతుండగా, ఏటా సెప్టెంబర్ చివరి నాటికి విత్తనాలను నాటడం ప్రారంభిస్తారు. అత్యధికంగా కోహీర్, కవేలి, గొటిగార్‌పల్లి, దిగ్వాల్, పీచెర్యాగడి, మాచిరెడ్డిపల్లి, సజ్జాపూర్, బిలాల్‌పూర్, మనియార్‌పల్లి గ్రామాల్లో పంట పండిస్తున్నారు. ఆలుగడ్డ విత్తనాలు మాత్రం స్థానికంగా లభించవు. దీంతో విత్తనాల కోసం చాలామంది రైతులు 2 వేల కిలోమీటర్ల దూరంలోని ఆగ్రా, పంజాబ్‌లోని జలంధర్, తదితర దూర ప్రాంతాల నుంచి లారీల్లో విత్తనాలను తీసుకొస్తున్నారు. కొంతమంది రైతులు వారం పాటు అక్కడే ఉండి సరైన విత్తనాల సేకరణ కోసం వేచి చూస్తున్నారు. దీంతో సమయం వృథాతోపాటు అన్నదాతలపై ఆర్థికభారం పడుతున్నది.



సంగారెడ్డి జిల్లా కవేలిలో ఆలుగడ్డ విత్తనాలను పరిశీలిస్తున్న రైతులు

### కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేయాలి



కోహీర్ మండలంలో చాలామంది రైతులు ఆలుగడ్డను పండిస్తున్నారు. నేను ఏటా 50క్వింటాళ్ల కంటే ఎక్కువగానే విత్తనాలను కొంటాను. నేను ఇంతకు ముందు విత్తనాల కోసం ఆగ్రా, జలంధర్ వెళ్లాను. అక్కడ అన్నీ కష్టాలే. రైతుల ఇబ్బందులు తీరాలంటే కోహీర్ మండలంలో కోల్డ్‌స్టోరేజీని ప్రభుత్వం ఏర్పాటు చేయాలి.

**-రాచూరి కనకరత్నం, రైతు, కోహీర్, సంగారెడ్డి జిల్లా**

### ప్రతిపాదనలు పంపిస్తాం



కోహీర్ మండలం నుంచి చాలామంది రైతులు ఏటా ఆగ్రా, జలంధర్, తదితర దూర ప్రాంతాలకు వెళ్లి ఆలుగడ్డ విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడే కోల్డ్‌స్టోరేజీ ఉంటే అంత దూరం వెళ్లాల్సిన అవసరం ఉండదు. రైతుల అవసరార్థం కోల్డ్‌స్టోరేజీ నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. స్థానికంగా కోల్డ్ స్టోరేజీ ఏర్పాటయ్యేలా చూస్తాం.

**-నవీన్‌కుమార్, కోహీర్ మండల వ్యవసాయాధికారి, సంగారెడ్డి జిల్లా**

## హరితహారం చెట్లు నరికివేత



సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి ఎర్రకుంట వద్ద నరికివేసిన చెట్లు

చేర్యాల, సెప్టెంబర్ 22 : సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం వేచరేణి గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రకుంట వద్ద చేర్యాల–కొమురవెల్లి ప్రధాన రహదారికి ఇరువైపులా హరితహారంలో నాటిన చెట్లను ఇటీవల నరికివేశారు. చెట్లు నరికివేయడంతో ఆహ్లాదకర పరిస్థితులు మాయమయ్యాయని, పరిసరాలు బోసిపోయి కనిపిస్తున్నాయని పలువురు ప్రయాణికులు తెలిపారు.విద్యుత్ తీగలకు తగులుతున్నాయనే సాకుతో చెట్లను ఎక్కడపడితే అక్కడ నరికివేస్తుండడంతో ప్రకృతి ప్రేమికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. చెట్లను నరికివేసిన వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, కొట్టివేసిన చెట్లకు బదులు మరో ప్రదేశంలో మొక్కలు నాటించి వాటి సంరక్షణ బాధ్యతలు వారికే అప్పగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## జల్సాలకు అలవాటు పడి చోరీలు

**ఏపీకి చెందిన నిందితుడికి రిమాండ్**



సిద్దిపేటలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్,సెప్టెంబర్ 22 : బంగారు దుకాణం నుంచి బంగారు గొలుసులతో పారిపోయిన దొంగను సిద్దిపేట పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట ఏసీపీ మధు ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడించారు.వైజాగ్‌లోని మద్దిలపాలెం గ్రామానికి చెందిన వేపంచి షణ్ముఖరెడ్డి జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని చోరీలు చేసేవాడు. ఈనెల 18న హైదరాబాద్ నుంచి స్నేహితుడి బైక్‌పై సిద్దిపేటకు వచ్చిన షణ్ముఖరెడ్డి, పట్టణంలోని లాల్‌కమాన్ వద్ద నయాంమియా బంగారు షాప్‌లోకి కస్టమర్‌గా ప్రవేశించి అధిక బరువు గల బంగారు గొలుసును చూపించాలని కోరాడు.దుకాణం యజమాని 5 బంగారు గొలుసులతో కూడిన ట్రేను చూపించగా, వాటిని తీసుకొని రెప్పపాటులో పారిపోయాడు. వారు ప్రయాణిస్తున్న బైక్ దుద్దెడ టోల్‌గేట్ వద్ద అదుపు తప్పడంతో పడిపోయారు. ప్రమాదంలో గాయపడిన షణ్ముకరెడ్డిని టోల్‌గేట్ సిబ్బంది ప్రథమ చికిత్స చేసి పంపించారు.అనంతరం ప్రజ్ఞాపూర్ వద్ద పార్కింగ్‌లో బైక్‌ను పెట్టి బస్సులో షణ్ముకరెడ్డి హైదరాబాద్‌కు వెళ్లాడు.హైదరాబాద్‌లో బంగారు గొలుసులను విక్రయిస్తే పట్టుబడుతానన్న అనుమానంతో కరీంనగర్‌లో అమ్ముదామని ఈనెల 21న ప్రజ్ఞాపూర్‌కు వచ్చి పార్కింగ్‌లోని వాహనాన్ని తీసుకుని కరీంనగర్‌కు బయలుదేరగా, సిద్దిపేట రాజీవ్ రహదారి రంగీలా దాబా వద్ద వాహన తనిఖీల్లో సిద్దిపేట టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు.అతని వద్ద 8తులాల బంగారు చైన్లు, చోరీకి వినియోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. కేసును ఛేదించిన పోలీసులను సీపీ అనురాధ అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ ఉపేందర్, ఎస్సై వెంకట్‌రెడ్డి, సిబ్బంది సుధాకర్‌రెడ్డి,ప్రశాంత్,యాదగిరి,ప్రవీణ్ ఉన్నారు.

## సీఎం సహాయనిధికి 'గీతం' కోటి విరాళం



విరాళం చెక్కును సీఎం రేవంత్‌రెడ్డికి అందజేస్తున్న గీతం అధ్యక్షుడు శ్రీభరత్

పటాన్‌చెరు, సెప్టెంబర్ 22 : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు, వైజాగ్ ఎంపీ శ్రీభరత్ మతుకుమిల్లి తెలంగాణ వరద సహాయక చర్యలకు మద్దతుగా సీఎం సహాయనిధికి రూ. కోటి అందజేశారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి చెక్కును అందజేశారు. గీతం ఉద్యోగులు సైతం ఒకరోజు వేత నం సీఎం సహాయనిధికి ఇచ్చారు. గీతం అధ్యక్షుడికి సీఎం రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కొద్ది రోజుల క్రితం ఏపీలోని వరద బాధితుల సహాయక చర్యలకు మద్దతుగా రూ. కోటి విరాళం అందజేశారు. సామాజిక బాధ్యతగా ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా ఆర్థికంగా, ఇతర సహాయ చర్యలకు అండగా ఉంటుందని శ్రీభరత్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పూర్వ ఐఏఎస్ అధికారి, గీతం ముఖ్య పరిపాలానాధికారి బీఆర్ మీనా, గీతం హైదరాబాద్ ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ పాల్గొన్నారు.

## ఆక్రమణలపై ముందస్తు చర్యలేవీ?

- అక్రమ నిర్మాణాలపై చోద్యం చూస్తున్న అధికారులు
- పట్టించుకోని సంబంధిత శాఖలు
- రోడ్డున పడుతున్న బాధితులు

అమీన్‌పూర్, సెప్టెంబర్ 22: దొంగలు పడ్డంక ఆరు నెలలకు కుక్కలు మొరిగిన చందంగా ప్రభుత్వ యంత్రాంగం వ్యవహరిస్తున్నది. అమీన్‌పూర్‌లో ఆదివారం హైడ్రా కూల్చివేతలు చేపట్టగా ప్రభుత్వ యంత్రాంగంపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. హైడ్రా కూల్చివేస్తున్న భవనాలు ప్రభుత్వ స్థలంలో ఉన్నాయని ఇప్పుడే తెలిసిందా అని అధికారులను ప్రజలు ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రలో ఉందా....ప్రైవేట్ పట్టా స్థలం సర్వేనంబర్‌ను వేస్తూ ప్రభుత్వ స్థలంలో డాక్యుమెంట్ తయారుచేసి రిజిస్ట్రేషన్ చేయడం ఎంతవరకు సబబుని ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు.తప్పుగా రిజిస్ట్రేషన్ చేసిన రిజిస్టర్ బాధ్యుడు కాదా....అదే డాక్యుమెంట్లతో ఎలాంటి పరిశీలన, పర్యవేక్షణ లేకుండా స్థానిక పంచాయతీ అధికారులు అనుమతులు ఇవ్వడం బాధ్యతారాహిత్యం కాదా....నిర్మాణం ప్రారంభ దశలో ఉన్న కట్టడాలు రెవెన్యూ యంత్రాంగానికి కనపడలేదా..అమ్యామ్యాలు స్వీకరించి చూసీచూడనట్లుగా వ్యవరించిన తీరును ఏమి అనుకోవాలి. ఇవన్ని తెలిసి అధికారులు ప్రజలను మోసం చేయడం కాదా...చివరగా సామాన్యులు మోసపోయి చిరకాల కోరికగా మిగిలి ఉన్న తన సొంతింటి కళ నెరవేర్చుకునేందుకు అనేక కష్టనష్టాలకు ఎదుర్కొని ఇల్లు కొనుక్కోవడం తప్పా..తామంతా కుటుంబంతో కలిసి ఇంట్లో ఉండగా ఒక్కసారిగా ఉప్పెనలాగా వచ్చి జేసీబీలతో కూల్చివేయడం ఎంతవరకు సమంజమని హైడ్రా కూల్చివేతలు సాగించిన చోటకు వచ్చిన అధికారులకు ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తాయి.వీటన్నింటికీ కారణం,కారకులు ఎవరు.. బాధ్యులు ఎవరు.. మోసపోయిన వాళ్లా.. మోసం చేసిన వాళ్ల అని ప్రశ్నించారు.వీరందరిపై చర్యలు తీసుకోకుండా సామాన్యులపై మీ ఆక్రోశమా... ఇది ఎంతవరకు ప్రభుత్వానికి సమంజసమని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా పంజా

- భారీ భవనాలు కూల్చివేత
- పోలీసు బందోబస్తు మధ్య భవనాలు నేలమట్టం
- ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగిన కూల్చివేతలు
- కన్నీరు మున్నీరైన బాధితులు
- రోడ్డున పడ్డ కిరాయిదారులు
- నెలకొన్న ఉద్రిక్తత వాతావరణం



సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో అపార్ట్‌మెంట్ కూల్చివేత

పటాన్‌చెరు/అమీన్‌పూర్, సెప్టెంబర్ 22: సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ సర్వే నంబర్లలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను హైడ్రా అధికారులు ఆదివారం కూల్చివేశారు. పటేల్‌గూడ పంచాయతీ పరిధిలోని బీఎస్సార్ కాలనీ సర్వేనెంబర్ 12లో 25 భవనాలను నేలమట్టం చేశారు. కిష్టారెడ్డిపేట గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారిపై ఉన్న ఆరు అంతస్తుల భవనంతో పాటు ఐదు అంతస్తుల రెండు భవనాలను బాహుబలి జేసీబీ ద్వారా కూల్చివేశారు. ఐలాపూర్ పంచాయతీ పరిధిలోని రెండు భారీ అంతస్తులు కలిగిన అపార్ట్‌మెంట్లను కూల్చివేయనున్నట్లు తెలిసింది.కిష్టారెడ్డిపేట్‌లో సర్వేనెంబర్ 164లో 500 గజాల్లో 5 అంతస్తుల భవనం నిర్మాణం రెండు నెలల క్రితం పూర్తిచేసి రెండు రోజుల క్రితమే పిల్లల దవాఖాన ప్రారంభించారు. ఈ దవాఖానలో చిన్నారులకు వైద్యం కొనసాగిస్తుండగానే కూల్చివేతల కోసం తక్షణమే ఖాళీ చేయాలని అధికారులు హుకుం జారీచేశారు. వైద్య పరికరాలు, ఫర్నిచర్‌ను మున్సిపల్ సిబ్బంది ఖాళీ చేయించి నిమిషాల వ్యవధిలో కూల్చివేశారు.



భారీగా చేరుకున్న కాలనీవాసులు

ఆదివారం ఉదయం 6 గంటలకు హైడ్రా అధికారులు, రెవెన్యూ అధికారులు వచ్చారు. పటాన్‌చెరు డీఎస్పీ ఆధ్వర్యంలో భారీ పోలీసు భద్రత నడుమ కూల్చివేతలు ప్రారంభించారు. కూల్చివేతల కొనసాగింపు రాత్రి వరకు కొనసాగింది.కూల్చివేతల సమాచారం ప్రజలకు తెలియడంతో వందలాది మంది అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగేందుకు యత్నించగా పోలీసులు వారించారు. బీఎస్ఆర్ కాలనీ పక్కనే ఉన్న సర్వేనెంబర్ 12లో సుమారు 16 భవనాలను కూల్చివేశారు. ఆ భవనాల్లో ఎక్కువ మంది కిరాయికి ఉంటున్నారు. వారిని అధికారులు అప్పటికప్పుడు ఖాళీ చేయించి కూల్చివేయడం అందరినీ ఆవేదనకు గురిచేసింది. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆగమేఘాల మీద గంటల వ్యవధిలో కూల్చివేస్తే తాము అప్పటికప్పుడు ఎక్కడికెళ్లి తల దాచుకోవాలంటూ కిరాయిదారులు కన్నీరుమున్నీరయ్యారు. ఇలాంటి చర్యలు ప్రభుత్వానికి మంచివి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కూల్చివేతల్లో హైడ్రా డీఎస్పీ శ్రీనివాస్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ రాధ, కమిషనర్ జ్యోతిరెడ్డి, ఇన్‌స్పెక్టర్లు సదా నాగరాజు, స్వామిగౌడ్, లాల్‌నాయక్, విద్యుత్తు ఏఈలు మణికంఠ, వెంకట్రామిరెడ్డి, టీపీవో పవన్, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వీధిన పడ్డ కుటుంబాలు




కిష్టారెడ్డిపేటలో కూల్చివేస్తున్న పిల్లల దవాఖాన



పటేల్‌గూడలో కూల్చివేస్తున్న ఇండ్లు



ఇల్లు కూల్చడంతో దిగులుగా కూర్చున్న చిన్నారులు